ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, ఆలయ నిర్మాణ దాతలు

ఆలయ ప్రారంభోత్సవానికి రావాలని సీఎంకు ఆహ్వానం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 : పట్టణంలోని మానేపల్లి హిల్స్‌పై నిర్మించిన స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి మార్చి 6న రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని నిర్వాహకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆలయ నిర్మాణ దాతలు మానేపల్లి మురళీకృష్ణ, మానేపల్లి గోపీకృష్ణ ఉన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

యువత సన్మార్గంలో పయనించాలి

- భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 25 : యువత సన్మార్గంలో పయనించాలని, అప్పుడే సమాజం ప్రశాంతంగా ఉంటుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. హిందూవాహిని ఆధ్వర్యంలో పట్టణంలోని నల్లగొండ చౌరస్తా సమీపంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మనశ్శాంతి కలుగుతుందని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను పొంది సమాజానికి ఉపయోగపడాలని అన్నారు. అనంతరం పట్టణంలోని పాత బస్డాండ్ నుంచి నల్లగొండ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, హిందూవాహిని రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల రాజు, జిల్లా అధ్యక్షుడు బీసుకుంట్ల శివగణేష్, నాయకులు ఆనంద్, రామరాజు, శివ, భరత్, భాను, హేమంత్, శ్రీధర్, అనిల్, సాయిగణేశ్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

బీబీనగర్, ఫిబ్రవరి 25 : మండలంలోని చోక్లాతండా నుంచి పెద్ద పలుగుతండాకు బీటీ రోడ్డు మంజూరు చేయాలని, గ్రామంలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయాలని నీలతండా గ్రామస్తులు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బానోతు గోపీనాయక్, శంకర్, పాండు పాల్గొన్నారు.

కరాటేలో బెల్ట్‌లు సాధించిన విద్యార్థులతో ప్రముఖులు

విద్యార్థులకు కరాటే బెల్ట్‌ల ప్రదానం

మోత్కూరు, ఫిబ్రవరి 25 : స్టాండర్డ్ షిటూరియా కరాటే ఇంటర్నేషనల్ డూ ఆధ్వర్యంలో క్రీడాకారులకు బెల్ట్‌లు ప్రదానం చేశారు. పట్టణంలోని ఓ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీలకు గ్రాండ్ మాస్టర్ పి.బాలరాజు హాజరై మాట్లాడారు. శరీర దారుఢ్యానికి కరాటే దోహదపడుతుందన్నారు. విద్యార్థులు ఆసక్తిని పెంచుకొని కరాటేలో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ స్థాయిల్లో రాణించిన వారికి బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ అన్నెపు వెంకట్, మశ్చేందర్, క్రీడాకారుడు బుర్ర సంతు, పాఠశాల కరస్పాండెంట్ బి.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కండ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎఫ్ఎస్‌సీఏ సభ్యులు

ఎఫ్ఎస్‌సీఏ ఆధ్వర్యంలో కండ్లద్దాల పంపిణీ

వలిగొండ, ఫిబ్రవరి 25 : ఫ్రెండ్స్ స్పోర్ట్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఎఫ్ఎస్‌సీఏ) ఆధ్వర్యంలో వారం క్రితం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. వారిలో చూపు సమస్య ఉన్నవారికి ఆదివారం ఉచితంగా కండ్లద్దాలు పంపిణీ చేశారు. సుమారు రూ.40వేల విలువైన కండ్లద్దాలను అందజేశామని డాక్టర్ కుంభం రామచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పల్సం రమేశ్, చండీప్రసాద్, కొండూరి భాస్కర్, కాసుల వెంకన్న, కూర శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, వెంకటరమణ, మురళి, వెంకటపాపి రెడ్డి పాల్గొన్నారు.

కండ్లద్దాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్, ఈసీఐఎల్ ఈలైట్ సంస్థ సభ్యులు

ఇంద్రపాలనగరంలో కంటి వైద్య శిబిరం

రామన్నపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని ఇంద్రపాలనగరంలో లయన్స్ క్లబ్, ఈసీఐఎల్ ఈలైట్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 53 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. 88 మందికి ఉచితంగా కండ్లద్దాలు, మందులు అందజేశారు.

భక్తజనసంద్రంగా పంచనారసింహుడి క్షేత్రం

నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట ఆలయం కొండపైన భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25 : పంచనారసింహుడి క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. ఎటుచూసినా భక్తులే కనిపించారు. ఆదివారం సెలవు కావడంతో స్వయంభూ నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాడవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాడ వీధులు, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాలలో భక్తుల రద్దీ నెలకొన్నది. కొండపైకి వాహనాల రద్దీ కొనసాగింది. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవను నిర్వహించిన అర్చకులు.. తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమం ఘనంగా జరిపారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం నిర్వహించారు. అనంతరం మొదటి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవలు, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. స్వామివారిని సుమారు 40వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ధర్మ దర్శనానికి 3 గంటలు, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి నిత్య ఖజానాకు రూ.48,96,311 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

రావులపల్లిలో రంగనాయకస్వామి రథోత్సవం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని పెద్ద రావులపల్లి గ్రామంలో భూనీలా సమేత రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూలతో అలంకరించిన రథంపై స్వామివారిని ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ జడల అంజయ్య, ఎంపీటీసీ చిలుక బుచ్చయ్య, మాజీ సర్పంచ్ మట్ట బాలమణి, ప్రతినిధులు దర్శన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

రావులపల్లిలో రంగనాయకస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పోచంపల్లిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

పోచంపల్లిలో శతఘటాభిషేకం

పట్టణంలోని మహమ్మాయిదేవి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా శతఘటాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలతో అలంకరించిన రథంపై స్వామివారిని ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చేపూరి రామ్మోహనాచారి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వనదేవతల జనజాతర

- చిన్న మేడారం జాతరకు 4లక్షలకు పైగా భక్తుల రాక

రాజాపేట, ఫిబ్రవరి 25 : భక్తుల కోరిన కోర్కెలు తీర్చి కొంగుబంగారంగా నిలిచిన వన దేవతల వేడుకలు మూడు ప్రాంతాల్లో నాలుగు రోజులుగా జన జాతరను తలపించింది. ఎటు చూసినా ఇసుక వేస్తే రాలనంత జనంతో రాజాపేట మండలంలోని చిన్న మేడారం, చల్లూరు గ్రామాలు కిక్కిరిసిపోయాయి. పెద్ద మేడారం తరహాలో పూజలు నిర్వహించగా భక్తి పారవశ్యంతో శివసత్తుల పూనకాలతో గద్దెల ప్రాంగణంలో వన దేవతల నామస్మరణ మార్మోగి భక్తిభావంతో పులకించింది. రెండు సంవత్సరాలకోసారి అడవి తల్లులు గద్దెలపై వస్తుండడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి వన దేవతల గద్దెలను తాకి తన్మయత్వం పొందారు. దేవతలకు నిలువెత్తు బంగారం, ఒడిబియ్యం, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించుకొని సల్లంగా దీవించు తల్లీ అని వేడుకున్నారు. సుమారు 4 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి, వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో నాలుగు రోజులుగా ఆ ప్రాంతమంతా జన సంద్రంగా మారగా.. దేవతలు వన ప్రవేశం చేయడంతో ఇప్పుడు బోసిపోయింది.

చిన్నమేడారంలో భక్తులు ఇంటి దారి పట్టడంతో బోసిపోయిన జాతర ప్రాంతం

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

రథం లాగుతున్న భక్తులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 25 : పట్టణంలోని రాయగిరిలో వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి దివ్య విమాన రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై అధిష్ఠించి వందలాది మంది భక్తుల నడుమ కనుల పండువగా ఊరేగించారు. భక్తులు పోటీ పడి రథాన్ని లాగారు.

పంచాయతీ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 25 : మండలంలోని పుల్లాయిగూడెం గ్రామ పంచాయతీ కార్మికుడు జోగు ముత్తయ్య వారం రోజుల క్రితం మృతి చెందాడు. అతని కుటుంబానికి గ్రామస్తుల సహకారంతో రూ.37వేల ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ మండల నాయకుడు పెసరు గోపాల్‌రెడ్డి ఆదివారం అందజేశారు. కూరెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య రూ.5వేల సాయం చేశారు. బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు స్వామిగౌడ్, అశోక్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు చంద్రం మృతికి జడ్పీ చైర్మన్ సంతాపం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 25 : పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దొడ్డమోని చంద్రంయాదవ్ శనివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం నిర్వహించిన అంత్యక్రియల్లో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొని మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చంద్రం మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. నివాళులు అర్పించిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 25 : మండలంలోని సరళమైసమ్మ దేవాలయం వద్ద చిలువేరు చంద్రశేఖర్ కిరాణా షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు ఆదివారం దాడి చేశారు. సుమారు రూ.10వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జగన్ మాట్లాడుతూ మద్యం అక్రమంగా విక్రయించినా, బెల్టు షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం విక్రయించిన కిరాణా షాపు నిర్వాహకుడు చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలని వినతి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 25 : గీత కార్మికులకు అందజేసే ఎక్స్‌గ్రేషియా నిధులను విడుదల చేయాలని మండలంలోని పల్లెర్ల గ్రామానికి చెందిన నోముల సిద్దుగౌడ్ ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గీత కార్మికుల సంక్షేమం కోసం అధిక నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఐదున్నర దశాబ్దాల అపూర్వ కలయిక

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న 1969-70 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

రాజాపేట, ఫిబ్రవరి 25 : మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1969 - 70లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆత్మీయంగా పలుకరించుకొని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 54 వసంతాలకు మొదటి సారి కలుసుకోవడంతో ముందుగా అనుమానపు చూపులు.. గుర్తుపట్టగానే చిన్ననాటి పేర్లతో పిలుచుకొని ఆలింగనం చేసుకున్నారు. ఎక్కడెక్కడో ఉన్నవారంతా వచ్చి దాదాపు ఆరు గంటల పాటు సంతోషంగా గడిపారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల ఆవరణలో కలిసి భోజనాలు చేసి మంచి చెడులతోపాటు ఆరోగ్య పరిస్థితులపై మాట్లాడుకున్నారు.

వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

చావా ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 25 : మారుమూల గ్రామాల్లో సైతం వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు సేవలందిస్తున్న చావా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని సైదాపురం గ్రామంలో భువనగిరి పట్టణానికి చెందిన ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి తీవ్రత ఎక్కువ కాకముందే పరీక్షలతో నిర్ధారణ చేసుకుని చికిత్స చేయించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలకు సేవలు అందిస్తున్న ఆర్కే హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాజ్‌కుమార్, ఆయన సతీమణి చావా ఆశ్లేషకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర శ్రీశైలం, వైస్ ఎంపీపీ ననబోలు ప్రసన్న, మాజీ సర్పంచులు శ్రీసాగర్‌రెడ్డి, బీర్ల శంకర్, ఆస్పత్రి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి సైదులు

బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలి

- జిల్లా బాలల సంరక్షణ అధికారి సైదులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 25 : వెట్టిచాకిరీ, బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.సైదులు అన్నారు. వెట్టిచాకిరీ నిర్మూలన, బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఫౌండేషన్ ఫర్ సస్టేనబుల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార రథం ఆదివారం భువనగిరికి చేరుకున్నది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నదన్నారు. బాలల అక్రమ రవాణా కలిచి వేస్తున్నదని పేర్కొన్నారు. బాలలను అసాంఘిక కార్యకలాపాలకు వాడుతున్నారని, ఇలాంటివి ఎవరి దృష్టికి వచ్చినా వెంటనే సంబంధిత అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం ద్వారా ఇలాంటి వ్యవస్థలను లేకుండా చేసేందుకు కృషి చేస్తున్న సంస్థను అభినందించారు. సార్ప్ (సఖి) సంస్థ అధ్యక్షురాలు బర్రె ప్రమీల, విజిలెన్స్ కమిటీ సభ్యులు సురుపంగ శివలింగం మాట్లాడుతూ వెట్టిచాకిరీ, బాలల అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థలు లేని సమాజ నిర్మాణం చేయాలన్నారు. ఇందుకు ప్రభుత్వ వ్యవస్థలతోపాటు సామాజిక సంస్థల పాత్ర కూడా అవసరమని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గ్రామగ్రామాన నిర్వహించాలని కోరారు. ఫౌండేషన్ ఫర్ సస్టేనబుల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రతినిధులు, కళాకారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

- మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, ఫిబ్రవరి 25 : పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. లకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు కొరగోని లింగస్వామి, బండమీద మల్లేశ్, దండ హిమబిందు, పోలోజు శ్రీధర్ బాబు, గోపగోని లక్ష్మణ్ పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ రమేశ్

జైనపల్లిని నేర రహిత గ్రామంగా తీర్చిదిద్దుకోవాలి

- బీబీనగర్ ఎస్ఐ రమేశ్

బీబీనగర్, ఫిబ్రవరి 25 : మండలంలోని జైనపల్లి గ్రామంలో ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో దొంగతనాలు, అసాంఘిక నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేర రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలన్నారు. గ్రామాల్లో యువత పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎంపీపీ రమేశ్‌రాజ్

వలిగొండ, ఫిబ్రవరి 25 : క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసంతోపాటు స్నేహభావం పెంపొందుతుందని ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన 70వ జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు జట్టు గెలుపు కోసం క్రీడాస్ఫూర్తితో కృషి చేయాలన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో నాగార్జున సాగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా స్థాయి సెలక్షన్ కమిటీ సభ్యులు తుమ్మల యుగేందర్‌రెడ్డి, నాగయ్య, సురేశ్, రాములు, మహేందర్, వెంకటేశం, యాదగిరి, కిష్టయ్య, లింగస్వామి, ప్రవీణ్ పాల్గొన్నారు.